సాక్షి నంద్యాల

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



రిజిస్ట్రేషన్లకు 'సెలవు'

కర్నూలు, కల్లూరులో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సంవత్సరం చివరిలో సెలవుల్లో వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 10లో▸



వీర జవాను 'శౌర్య' పరాక్రమం

దేశ రక్షణలో భాగమైన ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి అత్యున్నత శౌర్య పురస్కారం అందుకున్నారు కర్నూలు జిల్లా జవాన్. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1.633
ప్రస్తుతం	:1.627.27
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:84.817
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:429
అవుట్ ఫ్లో	:7,389

న్యూస్‌రీల్

వైభవంగా స్వాతి మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం భక్త జనసంద్రంగా మారింది. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని తరలివచ్చిన భక్తుల గోవిందా నామస్మరణతో గురువారం నల్లమల పులకించిపోయింది. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వాములను, అమృతవల్లీ అమ్మవార్లను ఆలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టు పీతాంబరాలతో అలంకరించి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్చాణలు.. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య స్వాతి, సుదర్శన హోమాలు వైభవంగా నిర్వహించి పూర్ణాహుతితో కార్యాక్రమాన్ని ముగించారు. రాత్రి విశేష పుష్పాలకంరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

తాగేందుకు నీళ్లివ్వండి



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కొత్తపల్లి: తాగేందుకు నీళ్లలేక ఇబ్బంది పడుతున్నామని, బిందె నీళ్లు ఇవ్వండి సార్ అని గిరిజనులు రవణమ్మ, నాగలక్ష్మి, భారతమ్మ, దేవమ్మ, లక్ష్మీదేవి, కృష్ణవేణిలు కోరుతున్నారు. గురువారం మండలంలోని శివపురం గూడెంలో నీటి కులాయి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఐదు రోజుల నుంచి గూడెంలో తాగేందుకు, నిత్యవసరాలకు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. మూడురోజుల క్రితం విద్యుత్‌మోటార్ స్టార్టర్‌ను మరమ్మతులు చేయిస్తామని తీసుకెళ్లి ఇంతవరకు తిరిగి చూడలేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీటి సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.


పైర్లను ముంచెత్తిన 'ఎస్సార్బీసీ'



కోవెలకుంట్ల: పట్టణ శివారులో ప్రవహిస్తున్న ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వకు గురువారం తెల్లవారుజామున అధికంగా నీటిని విడుదల చేయడంతో కోవెలకుంట్ల, గుంజలపాడు గ్రామాల సమీపాల్లో కాల్వ నీరు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి చేరింది. ఆయా గ్రామాల రైతులు గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, రవీంద్రనాథరెడ్డి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డిలకు చెందిన దాదాపు 150 ఎకరాల్లో పప్పుశనగ, పొగాకు పంటలు నీట మునిగాయి. రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.25 వేలు వెచ్చించారు. మరో నెల రోజుల్లో పంట చేతికందాల్సిన తరుణంలో కాల్వ నీరు పైర్లను ముంచెత్తడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్బీసీ అధికారులు నీటిని విడుదల చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు ఆరోపిస్తున్నారు. నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

బిల్లు సెగ!

విద్యుత్ బిల్లులు చలికాలంలోనూ ప్రజలకు సెగలు పుట్టిస్తున్నాయి. విద్యుత్ చార్జీలు పెంచకపోవడంతోపాటు ఉన్నవాటినే తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు.. అధికారం చేపట్టి ఆరు నెలలు కూడా గడవకముందే సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం వేసింది. ఇంధన సర్దుబాటు పేరుతో ఇటీవల యూనిట్‌కు రూ.1.50 వరకు చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం.. ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు పేరుతో వినియోగదారులపై తాజాగా మరోసారి చార్జీలు పెంచింది. మాట తప్పిన సర్కార్‌పై శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైంది. – నంద్యాల



- సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచిన కూటమి సర్కార్
- జిల్లా వినియోగదారులపై నెలకు రూ.5.06 కోట్ల భారం
- రూ.వేలల్లో బిల్లులు వస్తుండటంతో ఆందోళనలో పేదలు
- కూటమి సర్కారు విద్యుత్ బాదుడుపై నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ డివిజన్ల పరిధిలో మొత్తం 6.56 లక్షలు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 292 హెచ్‌టీ కనెక్షన్లు కాగా మిగిలినవన్నీ ఎల్‌టీ వినియోగదారులే. ఇంత వరకు ఈ విద్యుత్ కనెక్షన్ల నుంచి విద్యుత్ వినియోగం దృష్ట్యా అన్ని రకాల చార్జీలతో కలిపి రూ.67.29 కోట్లు కాగా, నవంబర్ నెలాఖరుకు (మొదటి సర్దుబాటు చార్జీతో కలిపి) డిమాండ్ ఏకంగా రూ.68.93 కోట్లకు పెరిగింది. ఇక రెండోసారి సర్దుబాటు చార్జీలతో కలిపితే ఈ డిమాండ్ మరో రూ.1.64 కోట్ల వరకు పెరిగే అవకాశాలున్నాయని విద్యుత్ శాఖ అధికారులే చెబుతున్నారు. జిల్లా ప్రజలపై కూటమి సర్కార్ ఏకంగా నెలకు రూ.5.06 కోట్ల అదనపు భారం వేస్తోంది. ప్రతి నెలా వినియోగదారుల నుంచి అదనంగా రూ.5.06 కోట్లు వసూలు చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

సంపద సృష్టి మాట మరిచి.. ప్రజల కష్టార్జితాన్ని దోచి..

గత ప్రభుత్వం కొన్ని సాంకేతిక కారణాలతో అరకొరగా పెంచిన విద్యుత్ చార్జీలను భూతద్దంలో చూపిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలపై రూ.వేల కోట్ల భారం మోపారు. సంపద సృష్టి మాట మరిచి ప్రజల కష్టార్జితాన్ని దోచుకునే దిశగా బాబు సర్కార్ విద్యుత్ చార్జీల పెంపు పిడుగును ప్రజల నెత్తిపై వేసింది. ఇప్పటికే పెంచిన చార్జీలను వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. గతంలో వచ్చిన బిల్లులను కూటమి ప్రభుత్వం ఇస్తున్న బిల్లులను చూసి ప్రజలు హడలెత్తిపోతున్నారు. గతంలో కంటే 20 శాతం మేర బిల్లులు అధికంగా వస్తుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇస్తున్న విద్యుత్ బిల్లుల్లో ఎఫ్‌పీపీసీఏ చార్జీలు అని చేర్చారు. (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్) ఇంధనం, విద్యుత్ కొనుగోలు ధరల సర్దుబాటు చార్జీలన్న మాట. ఈ పేరుతో ప్రభుత్వం ప్రజలపై అదనపు చార్జీల ముసుగు దెబ్బ వేసింది. గత ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ బిల్లులు భారం కాకూడదనే లక్ష్యంతో ఇంధనం, విద్యుత్ కొనుగోలు చార్జీలను విధించకుండా బిల్లులు జారీ చేసేది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకే కాక పరిశ్రమల వినియోగదారులకు కూడా బిల్లులు చెల్లింపు పెద్ద కష్టంగా అనిపించేది కాదు. ఆరునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు గత ప్రభుత్వ హయాంలో మినహాయించిన చార్జీలను సైతం వసూలు చేస్తోంది. ప్రస్తుతం వస్తున్న బిల్లులో 2022–23 సంవత్సరానికి సంబంధించి కొనుగోలు చార్జీలు నిమిత్తం యూనిట్‌కు 58 పైసలు, తాజాగా 2024–25 సంవత్సరానికి సంబంధించి యూనిట్‌కు మరో 40 పైసలు అదనంగా వేస్తున్నారు.

యూనిట్‌పై రూ.1 అదనంగా వసూలు

వినియోగించిన విద్యుత్‌కు సంబంధం లేకుండా యూనిట్‌పై రూ.1 అదనంగా వసూలు చేస్తోంది. మామూలుగా ఇన్ని యూనిట్లకు ఓ రేట్..పెరిగితే మరో రేట్ అని శ్లాబ్ ఉంటుంది. ఇప్పుడు ఎలాంటి మినహాయింపు లేదు. ఎన్ని యూనిట్లు కాల్చితే అన్ని యూనిట్లకు అదనంగా పెంచిన చార్జీలు చెల్లించాల్సిందే. ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర భారమవుతుంది. తక్కువలో తక్కువ చూసినా ప్రస్తుత రోజుల్లో సుమారు 200 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే శ్లాబు ప్రకారం బిల్లు ఎంత వచ్చినా... దానికి అదనంగా మరో రూ.200 చెల్లించాల్సి వస్తోంది. ఎగవేతదారులతో కలిగిన నష్టాన్ని సామాన్య, మధ్య తరగతి ప్రజల నుంచి సర్కారు ముక్కు పిండి వసూలు చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అదనంగా రూ.12,250 బిల్లు వచ్చింది



నవంబర్ నెలలో 4313 యూనిట్లు కరెంట్ వినియోగించగా రూ.51,914 బిల్లు వచ్చింది. మామూలుగా 4313 యూనిట్లకు రూ.39,664 బిల్లు రావాల్సి ఉండగా అదనంగా రూ.12,250 బిల్లు వచ్చింది. గత అక్టోబర్ నెలలో 2291 యూనిట్లకు రూ.29,852 బిల్లు వచ్చింది. ఈ రకంగా బిల్లులు పెంచితే వ్యాపారాలు ఎలా చేసుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లులు పెంచబోమని చెప్పి ఇప్పుడు అదనపు చార్జీల పేరుతో భారం వేయడం మంచిది కాదు. ఇప్పటికైనా వ్యాపారులను దృష్టిలో పెట్టుకొని పెంచిన చార్జీలను తగ్గించాలి.

– అమీర్‌బాషా, దాల్‌మిల్ యజమాని, నంద్యాల



తక్కువ యూనిట్లు కాల్చినా అదే బిల్లు



అక్టోబర్ నెలలో 121 యూనిట్లు విద్యుత్ కాల్చితే రూ.520 విద్యుత్ బిల్లు వచ్చింది. నవంబర్ నెలలో 104 యూనిట్లు అంటే 17 యూనిట్లు తక్కువ కాల్చినా రూ.520 బిల్లు వచ్చింది. విద్యుత్ అధికారులను యూనిట్లు తక్కువ వచ్చినా బిల్లు రూ.520 ఎందుకు వచ్చిందని అడిగితే విద్యుత్ చార్జీలు పెరిగాయని చెబుతున్నారు. సామాన్య ప్రజల మీద ఇలా అదనపు భారాలు వేయకూడదు. సామాన్య ప్రజలకు చాలా ఇబ్బంది.

– ఎస్.రామకృష్ణారెడ్డి, ఆకుమల్ల, సంజామల(మం)



విజయవంతం చేయండి



గత ఎన్నికల్లో కరెంట్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి విద్యుత్ చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా నిర్వహించనున్న పోరుబాట ర్యాలీని విజయవంతం చేయాలి. చెన్నమ్మ సర్కిల్ నుంచి బళ్లారి చౌరస్తా మీదుగా విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుంది. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి నిరసన సెగ చూపాలి. విద్యుత్ చార్జీలు పెంచబోమని అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కూడా కాకముందే ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా తుంగలో తొక్కిన ఘనత చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికే చెల్లుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు.. ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి విద్యుత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న విద్యుత్ అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నారు. నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో సాయిబాబానగర్ ఆర్చి నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వినతి పత్రం అందజేయనున్నారు. కల్లూరులో పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన ఆధ్వర్యంలో, బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆత్మకూరులో శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో, ఆళ్లగడ్డలో గంగుల బిజేంద్రా రెడ్డి, నందికొట్కూరులో దారా సుధీర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నారు.

తక్కువ యూనిట్లు కాల్చినా అధికంగా బిల్లు

అక్టోబర్ నెలలో 98 యూనిట్లు విద్యుత్ కాల్చితే రూ.402 కరెంట్ బిల్లు వచ్చింది. నవంబర్ నెలలో 82 యూనిట్లు విద్యుత్ కాల్చితే రూ.412 బిల్లు వచ్చింది. తక్కువ యూనిట్లు విద్యుత్ కాల్చినా గత నెల కంటే అధికంగా బిల్లు వచ్చింది. చంద్రబాబు ఎన్నికల సమయంలో బిల్లులు పెంచమని చెప్పి నేడు విద్యుత్ చార్జీల పేరిట ప్రజలపై భారం వేయడం శోచనీయం. ప్రభుత్వం వెంటనే పెంచిన బిల్లులు తగ్గించి సామాన్య ప్రజలపై భారం తగ్గించాలి.

– ఏ.అనిల్‌రెడ్డి, కల్లూరు, పాణ్యం నియోజకవర్గం

గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి ఉప ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజన ఉప ప్రణాళిక కింద కేటాయించిన నిధులు, సంబంధిత పనుల ప్రగతి నివేదికలను కలెక్టర్ పరిశీలిస్తూ సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గిరిజన ఉప ప్రణాళిక కింద సూచించిన ప్రొఫార్మాలో పథకాల వారీగా లక్ష్యాలు ఇవ్వాలన్నారు. ఆత్మకూరు, నందికొట్కూరు, కొత్తపల్లి, ప్యాపిలి మండలాల్లో అత్యధికంగా గిరిజన తెగలకు జనాభా ఉన్నారన్నారు. పీఎం జన్మన్ కింద పక్కా ఇళ్లు, రోడ్ల అనుసంధానం, తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్స్, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్ కనెక్షన్లు, మొబైల్ టవర్స్, ఆధార్ సీడింగ్, జన్ ధన్ అకౌంట్ తదితర 11 అత్యవసర సదుపాయం కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ శివప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, సీపీఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

చిరుత సంచారం

- భయాందోళనలో ప్రజలు

డోన్ టౌన్: మండలంలోని వెంకటాపురం, బొంతిరాళ్ల గ్రామ పరిసరాలల్లో కల్లె కొండ, పెద్ద గుమ్మకొండ, చిన్న గుమ్మకొండ, దెంతల గుండు, యల్లారెడ్డి చెరువు ప్రాంతాల్లో కొద్ది రోజులుగా రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వ్యవసాయ పనులకు, పశువులు, గొర్రెల పశుగ్రాసం, మేతకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయంటున్నారు. కొద్ది రోజుల క్రితం బొంతిరాళ్ల గ్రామ పరిసరాలల్లో రెండు కుక్కలను చంపి తినగా ఫారెస్టు బీట్ అధికారిణి భారతి ఘటనా ప్రదేశానికి వెళ్లి పాదముద్రలు సేకరించి చిరుతగా గుర్తించారు. బుధవారం ఇదే గ్రామానికి చెందిన మేకల కాపరి కుక్కను చిరుత చంపేసింది. రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు, కొందరు చూసినట్లు తెలుపుతున్నారు. గతంలో ఈ రెండు చిరుతలు చనుగొండ్ల, రాంకొండ గ్రామాల మధ్య ఉన్న కొండల్లో సంచరిస్తుండగా కొందరు వీడియోలు కూడా తీశారు. వీటితోపాటు వీటి పిల్లలన్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ కాగా ఫారెస్టు అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి నిర్ధారించారు. కాగా అటవీశాఖ అధికారులు చిరుత సంచారం వెలుగులోకి వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేసి, ఆ తర్వాత పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాల మీదకు రాక ముందే వాటిని బంధించి అభయరణ్యాలకు తరలించాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాతో మన్మోహన్ సింగ్‌కు అనుబంధం



రైతు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాటి పీఎం మన్మోహన్‌సింగ్, అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): జిల్లాతో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు ఎనలేని అనుబంధం ఉంది. ప్రధానమంత్రి హోదాలో ఆయన 2004లో కర్నూలు జిల్లాలో పర్యటించారు. గురువారం మన్మోహన్ సింగ్ కన్నుమూయడంతో జిల్లా ప్రజలు ఆయనను గుర్తు చేసుకున్నారు. 2004 జూలై ఒకటో తేదీన అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లెకు వచ్చారు. అక్కడ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను మన్మోహన్‌సింగ్ పరామర్శించారు. ఒక్కో రైతు కుటుంబానికి దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.5 లక్షల నగదు అందించి బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు. వెనుకబడిన కర్నూలు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని అప్పట్లో సోమయాజుల పల్లెలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రకటించారు. 9 ఏళ్ల చంద్రబాబు పాలనకు చమర గీతం పాడిన తర్వాత మొదటిసారి రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో పర్యటించారు. కాగా ఆయన ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోనే అనంతపురం జిల్లాలో ఉపాధి హామీ పథకం కూడా ప్రారంభించారు.

రైతులను ఏమార్చి.. సేవలు నిర్వీర్యం చేసి!

- రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిన కూటమి ప్రభుత్వం
- అన్నదాతకు దక్కని ఎరువులు, పురుగు మందులు
- మరుగున పడిన డిజిటల్ కియోస్క్‌లు, టీవీలు
- క్రమంగా నిర్వీర్యం చేస్తున్న కూటమి సర్కార్

అన్నదాతలకు విశేష సేవలందించే రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి.. ఉన్న సేవలను ఒక్కొక్కటిగా ఎత్తేస్తోంది. ఇప్పటికే డిజిటల్ కియోస్క్‌లు, టీవీలను మరుగున పడేసింది. మరోవైపు ఎరువులు, పురుగు మందులు అందించకుండా రైతులను చావు దెబ్బ కొట్టింది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక వెలుగు వెలిగిన రైతు భరోసా కేంద్రాలు ప్రస్తుతం బోసిపోతున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 కలిపి ఉమ్మడి జిల్లాలో 877 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 849, అర్బన్ ప్రాంతాల్లో 28 ఉన్నాయి. ఇవి వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటై వ్యవసాయ శాఖలో సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చాయి. గత ఐదేళ్లు రైతులకు విశేషంగా సేవలు అందించిన ఆర్‌బీకేలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ సర్టిఫికెట్ కూడా లభించింది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది.

అప్పట్లో అన్ని సేవలూ అక్కడే..

విత్తనం మొదలు పంటను మద్దతు ధరతో అమ్ముకునే వరకు రైతులకు ఆర్‌బీకేలు అండగా నిలిచాయి. ఖరీఫ్, రబీ సమయాల్లో ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఏపీఎంఐపీ, ఫిషరీస్, మార్కెటింగ్ తదితర శాఖల అన్ని రకాల కార్యక్రమాలు ఆర్‌బీకేల ద్వారానే అమలయ్యేవి. ఆర్‌బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన దాదాపు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేసేవారు. ఏ ఎరువు ఎందుకు ఉపయోగపడుతుందనే దానిపై అవగాహన కల్పించేవారు. డిజిటల్ కియోస్క్‌ల ద్వారా తమకు అవసరమైన వాటిని ఆర్డర్ చేస్తే 48 గంటల్లోనే సరఫరా అయ్యేవి. ఆడియో, వీడియోల ద్వారా వ్యవసాయ సలహాలు, సూచనలు ఇచ్చేవారు.

మరుగున పడిపోతున్న డిజిటల్ కియోస్క్‌లు, టీవీలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత డిజిటల్ కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. ఒక్కో కియోస్క్ విలువ రూ.90 వేల వరకు ఉంటుంది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ అనుబంధ శాఖల సేవలను పొందడానికి కియోస్క్‌లను వినియోగించేవారు. ప్రస్తుతం వీటి సేవలను ఉపయోగించడం లేదు. తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, కృష్ణగిరి, కోసిగి, హాలహర్వి, ప్యాపిలి, బేతంచెర్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి తదితర మండలాల్లో ఆరు నెలల కాలంలో కియోస్క్‌లను వినియోగించుకున్న దాఖలాలే లేవు. వ్యవసాయ శాస్త్ర వేత్తలతో ముఖాముఖి మాట్లాడి తమ సమస్యలను చెప్పుకొని పరిష్కారం పొందేందుకు ప్రత్యేకంగా రూ.45 వేల విలువ కలిగిన 41 ఇంచుల టీవీలు ప్రతి ఆర్‌బీకేకు సరఫరా చేశారు. దీంతో పాటు శాస్త్రవేత్తల సలహా, సూచనలపై చేసే ప్రసారాలను రైతులు వీక్షించేవారు. రైతుల విజయగాథలు, అభిప్రాయాలు కూడా చూసి స్ఫూర్తి పొందేవారు. ప్రస్తుతం డిజిటల్ కియోస్క్‌లు, టీవీలు వినియోగంలోనే లేకుండా పోయాయి. పలు ఆర్‌బీకేలకు భూసార పరీక్షలు నిర్వహించే కిట్లు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి కషాయాల తయారీకి ఉపయోగించే పరికరాల జాడే లేకుండా పోయింది.



ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందిన డోన్ మండలం కొత్తపల్లిలోని రైతు భరోసా కేంద్రం

పుస్తకాలు ఏమయ్యాయో?

రైతుల్లో వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంచేందుకు ప్రతి రైతుభరోసా కేంద్రంలో లైబ్రరీ ఏర్పాటు అయింది. కంది, పత్తి, మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న, వరి, పసుపు, మినుము, వివిధ పండ్ల తోటలు, కూరగాయల పంటలు మొత్తం 15 రకాల పంటలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంచేందుకు పుస్తకాలు సరఫరా అయ్యాయి. ఒక్కో పంటకు మూడు పుస్తకాలు ఆర్‌బీకేలో ఉండేవి. ప్రస్తుతం వాటి జాడే లేకుండా పోయింది.

తగ్గిన ఎరువుల సరఫరా

2014–15 నుంచి 2018–19 వరకు ప్రైవేట్ డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించే వారు. ఎంఆర్‌పీపై రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువకు విక్రయించేవారు. ఆర్‌బీకేలు ఏర్పాటైన తర్వాత ప్రైవేట్ డీలర్ల అక్రమాలు అదుపులోకి వచ్చాయి. అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచారు. 2022-23లో కర్నూలు జిల్లాలో దాదాపు 42వేల టన్నులు, 2023-24లో ఇప్పటి వరకు 46,000 టన్నులు ఎరువులు ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎరువులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఆర్‌బీకేల్లో సేవలు అందడం లేదు



గత ఏడాది వరకు ఎరువులు/పురుగు మందులు ఆర్‌బీకేల్లోనే అందేవి. ప్రభుత్వం మారడంతో ఆర్‌బీకేలు నిర్వీర్యం అయ్యాయి. మాకు 25 ఎకరాల భూములు ఉన్నాయి. మిర్చి, పత్తి, వేరుశనగ, కంది వంటి పంటలు వేస్తాం. ఏ అవసరం వచ్చినా డోన్ లేదా పత్తికొండకు పోవాల్సి వస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకొని ఆర్‌బీకేలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలి.

– ఈశ్వరరెడ్డి, బొందిమడుగుల, తుగ్గలి మండలం

వీర జవాను శౌర్య పరాక్రమం

- విధి నిర్వహణలో ముక్కవోని ధైర్య సాహసాలు
- కేంద్ర హోంమంత్రి చేతుల మీదుగా శౌర్య పురస్కారం
- ప్రశంసలు అందుకున్న బీఎస్ఎఫ్ జవాను బొల్లం రామాంజనేయులు



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నుంచి శౌర్య పురస్కారం అందుకుంటున్న బొల్లం రామాంజనేయులు

పత్తికొండ(తుగ్గలి): దేశ ప్రజలంతా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారంటే దానికి ప్రధాన కారణం సరిహద్దులో దేశ రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న జవాన్‌లు. ఇతర దేశాల నుంచి మన దేశాన్ని రక్షించడంలో, సంఘ విద్రోహశక్తులు దేశంలోకి చొరబడకుండా నిలువరించడంలో వారి పాత్ర కీలకం. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా ప్రాణాలకు తెగించి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ భరత మాతకు ఎనలేని సేవ చేస్తున్నారు. దేశ రక్షణలో భాగమైన ఓ జవాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి అత్యున్నత శౌర్య పురస్కారం అందుకున్నారు కర్నూలు జిల్లా జవాన్. పత్తికొండ పట్టణానికి చెందిన చేనేత కుటుంబమైన బొల్లం మాదన్న, గౌరమ్మలకు కూతురు, కుమారుడు సంతానం. కుమారుడు రామాంజనేయులు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, జూనియర్ కాలేజీలో ఇంటర్ వరకు చదివారు. 2003లో ఆర్మీకి ఎంపికై 2004లో బెంగళూరులో బీఎస్ఎఫ్ జవాన్‌గా చేరాడు. పంజాబ్‌లో ఏడాది పాటు శిక్షణ పొందాడు. ఆ తర్వాత త్రిపురలో పోస్టింగ్ ఇవ్వడంతో 2005 నుంచి 2009 వరకు అక్కడే విధులు నిర్వహించారు. జమ్మూలోని సాంబ జిల్లాలో మూడేళ్లు, అక్కడి నుంచి కాశ్మీర్ పుపువాడ జిల్లాలో పని చేశారు. అక్కడ రెండేళ్ల పాటు పనిచేశారు. 2015 నుంచి 18 వరకు శ్రీనగర్ పంతాంచౌక్ వద్ద వీఐపీ డ్యూటీ చేశారు. తర్వాత జమ్మూ రజౌరీ జిల్లాలో 2018 నుంచి 2021 వరకు పనిచేశారు. మంచు కొండల మధ్య పహారా కాస్తూ విధులు నిర్వర్తించారు.

ఆరోజు ఏమి జరిగిందంటే..

2020 డిసెంబర్ 1న లైన్ కంట్రోల్ (ఎల్‌సీ) వద్ద క్యూఆర్‌టీ (క్విక్ రియాక్షన్ టీం) కమాండర్ (ఎస్)తో కలిసి ఏడుగురు సిపాయిలతో కలిసి వెళ్లాం. ముందు రోజు రాత్రే లైన్ కంట్రోల్ వద్దకు చేరుకున్నాం. మన దేశానికి, పాకిస్తాన్‌కు మధ్యలో పెద్ద పెద్ద కొండలు, లోయలు ఉండే ప్రాంతం. విపరీతమైన చలి. ఉదయం లైన్ కంట్రోల్ వద్ద టీం ఉన్నాం. అక్కడి నుంచి రైస్, సరుకులు వంటివి మన స్థావరానికి తీసురావాలి. కమాండర్ సూచించిన విధంగా సరుకులు తీసుకొచ్చే పనిలో నిమగ్నమయ్యాం. ఉదయం 8 గంటల సమయంలో దాదాపు 15 మంది తీవ్రవాదులు మాపై ఒక్కసారిగా కాల్పులు జరిపారు. తీవ్రవాదులు దాడి చేస్తున్నారని అర్థమైంది. మా కమాండర్ (మణిపూర్ వాసి)కి బుల్లెట్ తగిలి కింద పడిపోయాడు. ఉన్న ఏడు మందిలో నేనే సీనియర్ కావడంతో చార్జ్ తీసుకున్నా. సహచరులకు కోడ్ భాషలో సూచనలిస్తూ తీవ్రవాదులపై ఎదురుకాల్పులు జరిపాం. ఇదే సమయంలో పాకిస్తాన్ సైన్యం కూడా మాపై కాల్పులు జరిపింది. ఏ మాత్రం భయపడకుండా ధీటుగా ఎదుర్కొన్నాం. సహచరులతో కలిసి ఐదుగురు తీవ్రవాదులను మట్టుబెట్టాం. మాలో కూడా కొందరికి గాయాలయ్యాయి. తీవ్రవాదుల కాల్పుల్లో నేను తృటిలో తప్పించుకున్నా. మా కాల్పుల ధాటికి తట్టుకోలేక తీవ్రవాదులు చనిపోయిన వారిని తీసుకుని వెనుదిరిగారు. అంతా సద్దుమనిగాక కమాండర్‌ను బుజాలపై ఎత్తుకొని సరుకులు స్థావరానికి చేర్చాం.



గ్యాలంట్రీ మెడల్

అయితే తీవ్రగాయాలైన కమాండర్‌ను కాపాడుకోలేక పోయాం. ఈ ఘటనను ఉన్నతాధికారులు పరిశీలించి ధైర్యసాహసాలు ప్రదర్శించిన తమ బృందాన్ని ప్రశంసించారు. 2023లో మెడల్ ఫర్ గ్యాలంట్రీ అవార్డుకు అనౌన్స్ చేశారు. 2024 బీఎస్ఎఫ్ 60వ వార్షికోత్సవాల్లో భాగంగా గత డిసెంబర్ 2న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శౌర్య పురస్కారం అందజేశారు. శౌర్య పురస్కారం అందుకున్న రామాంజనేయులు స్వగ్రామానికి రావడంతో ఆయన్ను పట్టణ ప్రజలు, స్నేహితులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఘనంగా సన్మానించారు.

దేశ రక్షణ సంతృప్తినిస్తోంది



దేశానికి రక్షణగా ఉంటూ సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తోంది. ఒక సైనికుడిగా దేశ రక్షణ కంటే మాకు ఏదీ ఎక్కువ కాదు. శౌర్య పురస్కారం మరింత బాధ్యతను పెంచింది. దేశ రక్షణలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా.

– బొల్లం రామాంజనేయులు, బీఎస్ఎఫ్ జవాన్

క్లుప్తంగా

తెలుగుగంగ కాల్వలో మృతదేహం లభ్యం



కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామ సమీపంలో తెలుగుగంగ (వీబీఆర్) కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. పొలాలకు వెళ్లిన రైతులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని పరిశీలించారు. సదరు వ్యక్తి 4 రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని, వయస్సు 40 - 50 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావించారు. ఎరుపు, తెలుపు రంగుల గళ్ల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, ముఖం గుర్తుపట్టడానికి వీలు లేకుండా కుళ్లిపోయిందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్ఐ 91211 01184, సీఐ 91211 01181 నంబర్లకు సమాచారం అందించాలని వివరించారు.

ఆకతాయికి రిమాండ్

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామం బస్టాండ్ వద్ద రోడ్డుపై వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన రాచముని ప్రేమ్‌కుమార్ దారిలో వచ్చి పోయే మహిళల వైపు చూస్తూ, సైగలు చేస్తూ, ఈలలు కేకలు వేస్తూ అసభ్యకరమైన పదజాలంతో దూషించడం, ప్రజలకు అసహ్యం కలిగేలా ప్రవర్తించడం, ప్రజాశాంతికి భంగం కలిగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. అతన్ని అరెస్ట్ చేసి నంద్యాల జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా సదరు వ్యక్తికి మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

రైతు రుణాలు మాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అర్లప్ప

కర్నూలు(సెంట్రల్): ఏపీలో మనువాద, రెడ్ బుక్ రాజ్యాంగాలను పక్కనపెట్టి, రైతులకు రుణమాఫీ చేసి అప్పుల ఊబి నుంచి ఉపశమనం కల్పించాలని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల అర్లప్ప డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7వ నెలలోకి అడుగు పెట్టినా ఒక్క సమస్యను కూడా పరిష్కరించడం లేదన్నారు. గురువారం సీక్యాంపులోని ఆ పార్టీ కార్యాలయంలో 21 మందితో అఖిల భారత ఐక్య రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని బంగారు గ్రామంలో 16 రాష్ట్రాలకు సంబంధించిన రైతు సంఘాల నాయకుల సమావేశం జరిగిందన్నారు. ఈ కమిటీ సూచన మేరకు 21 మంది రైతు సంఘాల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు రైతులకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేష్, మనోహర్, మహేంద్ర, వెంకటేష్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారుడు థాసిఫ్

కొత్తపల్లి: ఓ పల్లెటూరి విద్యార్థి జిల్లాస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అదే ప్రతిభను రాష్ట్రస్థాయిలో చూపించాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ప్రోత్సహించారు. గురువారం మండలంలోని దుద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు థాసిఫ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సెప్టెంబర్ 25న నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన అండర్-17 త్రోబాల్ క్రీడాపోటీల్లో తమ పాఠశాల పదో తరగతి విద్యార్థి థాసిఫ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యాడన్నారు. ఈ విద్యార్థి ఈ నెల 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాకలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోనిలో విజిలెన్స్ తనిఖీలు



సీజ్ చేసిన సిలిండర్‌లతో విజిలెన్స్ అధికారులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఐదు హోటళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. హోటళ్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమర్షియల్ వంటగ్యాస్ సిలిండర్‌లను వినియోగించాల్సి ఉండగా నిర్వాహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లను వినియోగిస్తున్నారన్నారు. పరోటా మిలిటరీ హోటల్‌లో ఒక సిలిండర్, శివ గోబీ పాయింట్‌లో రెండు సిలిండర్‌లు, ఆర్గానిక్ టీ వనంలో ఒక సిలిండర్, బాబా దమ్ బిర్యానీ హోటల్‌లో రెండు సిలిండర్‌లు, శివ చికెన్ సెంటర్‌లో రెండు సిలిండర్‌లను సీజ్ చేసినట్లు చెప్పారు. ఆయా నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు వెంకటరమణ, పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దార్ వలీబాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేసేందుకు రోడ్డుపై వేసిన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న కర్ణాటక, తెలంగాణ మద్యం, నాటుసారాను గురువారం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఈఎస్టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మొత్తం 80 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1506 లీటర్ల మద్యం, ఒక కేసులో పట్టుబడిన 10 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు చెప్పారు. వీటి విలువ రూ.7 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం సరిహద్దు దాటి రాకుండా నదీ తీర ప్రాంతాలు, మాధవరం చెక్‌పోస్ట్ వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ ఎస్ఐ ఇస్మాయిల్, పెద్దకడుబూరు, రూరల్ పోలీసులు ఉన్నారు.

ఆరిన ఆశల దీపం

- రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం



కల్యాణ్ (ఫైల్)

శిరివెళ్ల: కడప- కర్నూలు జాతీయ రహదారిపై గురువారం యర్రగుంట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి కల్యాణ్ (22)దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆళ్లగడ్డ పట్టణంలోని పద్మనాభరావు వీధికి చెందిన నీలి లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు నీలి కల్యాణ్ అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఏవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ కళాశాలకు చెందిన బస్‌లోనే వెళ్లేవాడు. అయితే గురువారం పరీక్ష ఉండడంతో ఆలస్యం అవుతున్న ఆందోళనతో స్నేహితుని బైక్‌పై కళాశాలకు బయలుదేరాడు. యర్రగుంట్ల వద్ద వెళుతుండగా తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణ్‌కు రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. యువకుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిన్న పీరయ్య కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

నాడు తండ్రి.. నేడు కుమారుడు

విధి రాత ఆ కుటుంబాన్ని వెంటాడింది. యువకుడి తండ్రి నీలి లక్ష్మీనారాయణ జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఆరేళ్ల కితం బైక్‌పై నంద్యాలకు వెళ్లి తిరిగి ఆళ్లగడ్డకు వస్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. రెండు రోజులపాటు వైద్యశాలలో చికిత్స పొంది కోలుకోలేక కన్నుమూశాడు. భర్తను కోల్పోయిన లక్ష్మీదేవి కుటుంబ బాధ్యతను తనపై వేసుకుంది. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. రెండేళ్ల కిందట కుమార్తెకు వివాహం చేసింది. కుమారుడిని ఉన్నత చదువులు చదివిస్తోంది. బిడ్డ ప్రయోజకుడు అయితే తమ కష్టాలు తీరుతాయని ఆ తల్లి గంపెడాశతో ఉంది. ఈ స్థితిలో రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోవడంతో ఆ కుటుంబ ఆశల దీపం ఆరిపోయినట్లయింది.

మల్టీపర్పస్ గోదాములను వినియోగించుకుందాం

- మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత



గోదాములను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత

కర్నూలు(అగ్రికల్చర్): మల్టీపర్పస్ గోదాములను రైతులు వినియోగించుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కల్లూరు మండలం చిన్నటేకూరులో నిర్మించిన రెండు మల్టీపర్పస్ గోదాములను డైరెక్టర్ తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులతో ముఖాముఖి మాట్లాడారు. గోదాముల పనులు పూర్తయ్యాయని, త్వరలోనే సంబంధిత పీఏసీఎస్‌కు స్వాధీనం చేస్తామని మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు డైరెక్టర్‌కు వివరించారు. పీఏసీఎస్‌లకు స్వాధీనం చేసిన తర్వాత పంట దిగుబడులను నిల్వ చేసుకునేందుకు రైతులకు అద్దెకు ఇవ్వవచ్చని సూచించారు. గ్రామంలో గోదాములు నిర్మించడం హర్షణీయమని, దిగుబడులకు గిట్టుబాటు ధరలు లేనప్పుడు గోదాముల్లో నిల్వ ఉంచి, గిట్టుబాటు ధర వచ్చినప్పుడు విక్రయించేందుకు చక్కటి అవకాశమని పేర్కొన్నారు. ఈ గోదాముల వల్ల సహకార సంఘాలు లాభాల బాట పట్టే అవకాశం ఉందన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, ఏడీ నారాయణమూర్తి, డీఈలు సుబ్బారెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు ఉన్నారు.

విజయీభవ!



జాతీయ పోటీలకు వెళ్తున్న క్రీడాకారిణులకు వీడ్కోలు పలుకుతున్న మాజీ క్రీడాకారులు

డోన్: 70వ సీనియర్ జాతీయ బాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు రేపటి నుంచి మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లా కామోతి పట్టణంలోని ఎంఏడీపీ విద్యాలయం ఆవరణలో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు సభ్యులు 10 రోజుల పాటు నంద్యాల జిల్లా డోన్‌లో వింటర్ కోచింగ్, ప్రాక్టీస్ క్యాంప్ పూర్తి చేసుకొని గురువారం మహారాష్ట్రకు బయలుదేరి వెళ్లారు. మహారాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నాయి. ఆరు కేటగిరీలలో 32 రాష్ట్రాలు చాంపియన్ షిప్ పోటీల్లో తలపడనున్నాయి.

శిక్షణ సమయంలో అన్నీ తానై..

ఒకప్పటి జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, డీఎస్పీ శ్రీనివాసులు పదిరోజుల పాటు రాష్ట్ర క్రీడాకారిణులకు స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బస ఏర్పాటు చేయడంతో పాటు భోజన సౌకర్యం కల్పించారు. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులైన కేఈ మౌలా, కామేష్, రషీద్, చంద్రారెడ్డి, ఇంతియాజ్, శేఖర్, ప్రకాష్ తదితరులతో క్రీడాకారిణులకు తగిన మెలకువలను నేర్పించారు. శ్రీకాకుళం, విశాఖ, కర్నూలు, చిత్తూరు, గుంటూరు, ఈస్ట్, వెస్ట్ గోదావరిలకు చెందిన క్రీడాకారిణులకు చివరి రోజు డీఎస్పీ సహకారంతో బ్యాట్లు, షూస్, క్రీడాదుస్తులను అందజేసి విజయీభవ అంటూ సీనియర్ క్రీడాకారులందరూ ఆశీర్వదించి వీడ్కోలు పలికారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై దాడులు



దాడులు నిర్వహించేందుకు వచ్చిన విజిలెన్స్ బృందం

గడివేముల: రైతుల పేర్లతో విద్యుత్ కనెక్షన్లు తీసుకొని అక్రమంగా చేపల చెరువులకు వినియోగిస్తున్న వారిపై గురువారం విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో ఐదు చోట్ల దాడులు నిర్వహించారు. గడిగరేవుల, కొరటమద్ది, తిరుపాడు, దుర్వేసి గ్రామాల పరిధిలో గత కొన్నేళ్ల నుంచి దాదాపు 40 దాకా చేపల చెరువులను నిర్వహిస్తున్నారు. నిర్వాహకుల మధ్య విభేదాల వల్ల ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో విజిలెన్స్ దాడులు జరిగినట్లు సమాచారం. గురువారం కర్నూలు జిల్లా విజిలెన్స్ సీఐ నాగరాజుయాదవ్, ఎస్ఐ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఐదు బందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 16 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో రాజు అనే వ్యక్తికి చెందిన 8 మోటార్లు సీజ్ చేశారు. వెంకటసుబ్బయ్య సంజీవకుమార్, శంకర్ రెడ్డి తదితరులపై కేసు నమోదు చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై ఎంత అపరాధ రుసుము విధించాలో నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు వెల్లడించారు. అయితే అక్కడే చేపల చెరువులు నిర్వహిస్తున్న కొంతమందిపై దాడులు నిర్వహించకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది.

కారు బోల్తా పడి ఉపాధ్యాయులకు గాయాలు

- అకస్మాత్తుగా టైర్ పేలడంతో ప్రమాదం
- పాణ్యం సమీపంలో ఘటన



గాయపడిన ఉపాధ్యాయులను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిపై సాయిబాబా నర్సరీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఉపాధ్యాయులకు గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపారు. వివరాలు.. నంద్యాల పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు నూర్ అహ్మద్, పరమేష్, శైలజ, లక్ష్మీదేవి, మరో ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి బేతంచెర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్నారు. గురువారం విధులు ముగించుకొని నంద్యాలకు వస్తుండగా సాయిబాబా నర్సరీ వద్దకు రాగానే టైర్ పేలడంతో కారు అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో నూర్ అహ్మద్‌కు రక్తగాయాలు కాగా మిగతా వారందరికీ మూగ గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. టైరు పేలడంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి పల్టీకొట్టి పక్కనేఉన్న నర్సరీలోకి వెళ్లి పడింది. ఆ సమయంలో ఎయిర్‌బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు గాయాలతో బయటపడ్డారు. కారును ఉపాధ్యాయుడు నూర్ అహ్మద్ నడిపినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. హైవేపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

- అలాగే పాణ్యం వద్ద జాతీయ రహదారిపై చందమామ హోటల్ సమీపంలో బుధవారం రాత్రి నెల్లూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ పెళ్లి ట్రావెల్ కారును గుర్తు తెలియని ఐచర్ లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవ్వరికీ గాయాలు కాలేదు.

29న హాకీ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో ఈనెల 29వ తేదీన నంద్యాల జిల్లా సబ్ జూనియర్ హాకీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు, జాయింట్ సెక్రటరీ దివాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నంద్యాల జట్టుకు ఎంపికైన బాలుర జట్టు జనవరి 17, 18, 19 తేదీల్లో మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే బాలికల జట్టు ఎంపికైన క్రీడాకారులు జనవరి 27, 28, 29 తేదీల్లో అనంతపురంలో ఆర్‌డీటీలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీలను స్టీఫెన్, కెనడీ, ప్రసిడెంట్ పాల్‌రాజారావు, సీనియర్ క్రీడాకారులు శ్రావణ్, మధు, ఓబులేసు పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

రిజిస్ట్రేషన్లకు సెలవు

- కర్నూలు, కల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌లు లీవ్‌పై వెళ్లడంతో క్రయవిక్రయదారుల ఇబ్బందులు
- ఉన్నవారితో పనిసర్దుబాటు చేయించలేకపోతున్న జిల్లా రిజిస్ట్రార్
- జనవరి నుంచి చార్జీలు పెరగనుండటంతో రిజిస్ట్రేషన్ల కోసం పెద్ద ఎత్తున వస్తున్న జనాలు



కల్లూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ కోసం ఎదురు చూస్తున్న వినియోగదారులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు, కల్లూరులో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.అవసరం ఉన్నప్పుడల్లా సెలవు పెట్టేసి విధులకు రావడం లేదు. కనీసం కింది స్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించకుండా వెళ్తుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. గురువారం రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు సెలవులో వెళ్లడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. విక్రయదారులు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో కిందిస్థాయి సిబ్బందితో పని సర్దుబాటు చేయించారు. దీంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి రిజిస్ట్రేషన్లు జరిగాయి.

తనకు సంబంధం లేదన్నట్లుగా జిల్లా రిజిస్ట్రార్

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం కిందనే కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేస్తున్నాయి. జిల్లా రిజిస్ట్రార్‌గా చెన్నకేశవరెడ్డి ఉన్నారు. అయితే ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏమి జరుగుతున్నా తనకేమి సంబంధం లేదన్నట్లుగా ఉంటున్నారు. తాను ఎంఅండ్ఎఫ్ (మార్కెట్ విలువ) జిల్లా రిజిస్ట్రార్‌నని, తనకు జిల్లా రిజిస్ట్రార్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో అప్పగించారని, ఎవరైనా రెగ్యులర్‌గా వస్తే వారే చూసుకుంటారన్న ఆలోచనలో ఉన్నారు. అంతేగాక తాను త్వరలోనే పదవీ విరమణ చేయనున్నానని, ఎక్కడ ఏమి జరిగితే తనకెందుకన్న మీమాంసలో ఆయన ఉన్నారు.

ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్న వైనం..

కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేరు. దీంతో కల్లూరుకు శ్రీనివాసరావు, కర్నూలుకు శశికుమార్ అనే సీనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా ఉన్నతాధికారులు నియమించారు. వీరు సక్రమంగా కార్యాలయాలకు రావడం లేదు. కర్నూలు సబ్ రిజిస్ట్రార్ శశికుమార్ రెండు వారాలుగా సెలవు పెట్టారు. ఆయన తరువాతి స్థానంలో వరప్రసాదు, భవనీశంకర్ అనే సీనియర్ అసిస్టెంట్లు ఉన్నా వారు తమకు ఇన్‌చార్జ్ బాధ్యతలు వద్దని చెబుతున్నారు. గురువారం రోజున జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న రమేష్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించి పనిచేయించారు. కల్లూరులో రాఘవేంద్ర అనే సీనియర్ అసిస్టెంటు తరువాతి బాధ్యతలు చూస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో రోజుకు 60-80 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అయితే రెగ్యులర్ ఎస్ఆర్‌ఓలు లేక ఇన్‌చార్జ్‌లు ఉన్నా సక్రమంగా కూర్చోకపోవడంతో రెండు కార్యాలయాల్లో కలిపి రోజుకు 30 డాక్యుమెంట్లు దాటడం లేదు. రిజిస్ట్రేషన్లు సక్రమంగా కాకపోవడంతో క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు రెండు, మూడు రోజులు ఇక్కడే వేచి ఉండాల్సి వస్తుండడంతో ఇక్కట్లకు గురవుతున్నారు.

> **ఒక్క డాక్యుమెంట్‌కు రెండు రోజులు**
>
> నేను మా బంధువుల నుంచి ఇంటిని కొనుగోలు చేశాను. వారు హైదరాబాద్‌లో ఉంటారు. రిజిస్ట్రేషన్ చేయడానికి ఒక్కరోజు సరిపోతుందని చెప్పడంతో వారు వచ్చారు. అయితే ఒక్క రోజులో పనికాకపోవడంతో వారు మధ్యలోనే వాళ్లకు వేరే పని ఉందని వెళ్లిపోయారు. దీంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది.
>
> – రామకృష్ణారెడ్డి, కర్నూలు

జనవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెరుగుదల

కూటమి ప్రభుత్వం జనవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని నిర్ణయించింది. ఇందుకు ఇప్పటికే మార్కెట్ విలువ సవరణ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. చార్జీలు పెరుగుతుండడంతో డిసెంబర్ 31లోపే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలన్న ఉద్దేశంతో ఎక్కువ మంది వస్తున్నారు. అయితే సబ్ రిజిస్ట్రార్లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు.